# గుండెలో కోయిల

## విహారి

శివపురం-రంగప్ప మాష్టారి ఊరు.

శివపురంలోనే ఆ రాత్రికి నా మజిలీ. డొంక రోడ్డున గతుకుల్లో పడిలేస్తూ పోతోంది జీపు. మౌనంగా జీపుని తోలుతున్నాడు ఖాశిం.

అప్పటికి ఐదు రోజులుగా పదిపన్నెండు పల్లెలు పూర్తిచేశాను. శివపురంతో అధికారులు నాకు అప్పజెప్పిన పనినికూడా - పూర్తి చేస్తున్నట్టే !

రోడ్డువారగా నిలబడి చూస్తున్నారు దారినవెళ్తున్న ఆసాములు. దూరంగా పొలాల్లో ఒకరిద్దరు పెద్దయ్యలు పొన్నుకర్రమీద ఆనుకుని కళ్లు విప్పుకుని పరిశీలిస్తున్నట్లు తోస్తోంది.

సూర్యుడు నారింజపండు రంగులో - తాటితోపులోకి దిగబడిపోతున్నాడు.

నారింజపండు - నాన్నకి చాలా యిష్టం.

నాన్న గుర్తుకొచ్చాడు. ఆ వెంటనే నాన్నరాసిన ఉత్తరం గుర్తుకొచ్చింది ఉత్తరంలో విషయం గుర్తుకొచ్చింది.

ఆ విషయం చదువుతుంటే నాకు వ్రణం మీద ఉప్పురుద్ది నట్లనిపించింది.

అవును.

"శారద స్వయంపాకంమనిషి. దాన్ని మనస్తాపాన ముంచి నువు సాధించేదే వుంది ?"—ఇదీ ఆయన రాత ! నాకయితే కుమ్మపొగ పెట్టినట్లే వుంటుంది.

ఉలిక్కిపడ్డాను. దూరంగా రైలుకూత వినిపించింది ! నడిదిబ్బమీద చింత చెట్టుని దాటుతోంది. జీపు తోటల్లో నుంచీ గూళ్లకి వెళ్లిపోతున్నై పిట్టల గుంపులు.

ఊరు దగ్గరయింది. నా ఆలోచన ఆగింది.

రంగప్ప మాష్టారు గుర్తుకొచ్చారు. రంగప్పగారంటే ఆ రోజుల్లో చండశాసనుడు. తెలివిలోనూ అపరచాణుక్యుడు. ఆయన మంచి స్థూలకాయుడు. బుర్ర మీసం, కోటు, పంచె పెద్దపాగా, మంచి అట్టహాసంగా వుండేవాడు. దానికితోడు కంచు కంఠం "రేయ్" అని ఆయన ఒక్క కేక పెడితే చాలు ఊళ్లో పిల్లలంతా నోర్లకి టాకీలు వేసినట్లు మూగపోయేవాళ్లు.

రంగప్పమేష్టారంటే రూళ్లకర్రమాష్టారనే అర్థం. రూల్సుని రూళ్లకర్రలు చేసి పిల్లలకి వాటితోనే పాఠాలు చెప్పేవాడు. స్కూల్‌కి లేట్‌గావస్తే తొడపాశం, పాఠంరాకపోతే గోడకుర్చీ, అల్లరిచిల్లరి పనులకి మెటికలమీద రూళ్లకర్రతో సంఖ్యామానం చెప్పించడం – ఆయన "మెథడ్స్"గా వుండేవి.

"ఊళ్లోకొచ్చాం సార్" అంటూ జీపుని ఆపేడు, ఖాశిం. నేను ఆలోచనల్లోంచి తేరుకుని పక్కకిచూసేను.

పంచాయితీ ఆఫీసు !

ఇంజన్ ఆపమంటూ క్రిందికి దిగేను.

విధినిర్వహణ మొదలెట్టాను. ఖాశింని రంగప్పగారిని పిలుచుకురమ్మని పంపేను. రంగప్పగారియిల్లు నేను చూపిస్తానంటూ ఎవరో కుర్రాడు జీపెక్కి కూర్చున్నాడు. జీప్ వెళ్లిపోయింది.

* * *

రాత్రి ఎనిమిది దాటింది.

రంగప్పగారి ఇంటికి చేరేము. ఆయన ఊరికి కొంచెం దూరంగా మెరక చేనులో యిల్లుకట్టుకుని దాన్లో వుంటున్నారుట.

చేను చుట్టూకొబ్బరి చెట్లు లోపల కూరగాయల పాదులూ, పూల మొక్కలూ వాక పక్కగా మామిడి, జామి, సపోటా, నారింజలూ వున్నై. బావి పక్కన అరటి తోటవుంది. ఒక మూలగా పనస చెట్టు వెలిసింది. "ఇది పడిమొలిచిన పంపరపనస" అంటూ ఆ చెట్టునీ చూపించారు రంగప్పగారు. ఈ తోటకి మధ్యగా చిన్నకుటీరంలా ఆయన ఇల్లువుంది. వరండా, రెండుగదులూ వున్నై, కప్పు బంగాళాపెంకుది.

"మీలో ఈ మార్పు చాలా వింతగావుంది"- మంచినీళ్ల గ్లాసు కింద వుంచుతూ అన్నాను.

రంగప్పగారు వేదాంతిలా నవ్వేరు.

ఆయన కేసి తేరిపార చూశాను.

ఇప్పటి రంగప్పగారిలో అప్పటి రంగప్పగారిలోని "పవర్" లేదు. మనిషి మరుగుజ్జులా అయాడు. చూపుసరిగా ఆనదు. చేతిలో కర్ర, ముగ్గుబుట్టలాంటి జుట్టు స్వరం పీలగావుంది. కుర్చీలో ముందుకు జరిగేను.

తాను చెప్పింది నాకు సరిగా వినిపించలేదని అర్థమయింది ఆయనకి. మళ్లీ మొదలెట్టేడు.

"మెషిన్‌గన్‌ని పేల్చే సైనికుడికైనా విశ్రాంతి అవసరం కాదూ ?" అని ఎటోచూస్తూ క్షణంసేపు ఆగేడు, నేను తోటలో కర్రకు కట్టిన బల్బువెలుగును చూస్తున్నాను.

"నూరుగొడ్లను తిన్న రాబందుకూడా గాలివానకు కొట్టుకుపోతుంది.రాజూ" అన్నాడు గొంతు గద్గదికమైనట్టు తెలుస్తూనే వుంది. నేను మౌనం వహించాను.

పూలమొక్కలమీద నుంచి చిరుగాలి ఒకటి చిన్నగా విసిరింది.

"క్రమశిక్షణతో పిల్లల్ని గొప్పవాళ్లని చేద్దామనుకున్నాను." ఆయన మొదలెట్టాడు. నేను వింటున్నాను.

"నీకు తెలుసోతెలీదో—మా రామ్మూర్తి సంగతి ?"

"ఏమైంది" అడిగేను.

"నువ్ యెస్సెల్సీ పూర్తిచేసి పట్నం వెళ్లిన తర్వాతి సంవత్సరం నేను మీ వూరినుంచీ బదిలీ అయ్యాను. కొత్తపల్లి వేశారు. రామ్మూర్తి ఆయేడు కొత్తపల్లిలో యస్సెల్సీ పాసయ్యాడు. కాలేజీ చదువుకి తిరుపతి పంపాను. అక్కణ్ణుంచీ నా యిక్కట్లు మొదలైనై."

"అంటే—"


"నెల నెలా అడిగిన డబ్బు పంపేవాణ్ణి. సవ్యంగా చదువుకుంటున్నాడని అనుకునేవాణ్ణి నేను. ఒక్క ఏడాదిలోనే చెడిపోయాడు. సెలవలకి ఇంటికివస్తే, వాళ్లూ వీళ్లూ చెప్పిన వాటిలో నిజమెంత అని నిగ్గదీశాను. వాడేమన్నాడో తెలుసా?"

రంగప్పగారి కళ్ళల్లో నీళ్ళు పేరుకున్నై, నేను గమనించాను.

"చిన్నప్పటినుంచీ నువ్ నన్ను రాచి రంపానపెట్టినందుకు నీకు తగిన శాస్తి చేయదలచుకున్నాను. నా యిష్టంవొచ్చినట్లు నేనుంటాను. ఏంచేస్తారో చెయ్యండి" అన్నాడు.

"నాకు నిజంగా నిలువుగుడ్లు పడినై, వాడి తెంపరితనం, మొండితనం, మూర్ఖత్వం నన్ను పశువుగా మార్చేసినై. ఉద్రేకంలో వాణ్ణి ఇంట్లోంచీ వెళ్ళగొట్టేశాను. బుద్ధిగా చదువుకోమని కన్నకొడుకుని మందలించడం నేరమా? నువ్ చెప్పు. మాష్టారుగా మిమ్మల్నందర్నీ ఎన్నెన్ని దండనలకి గురిచేశాను, అంతమాత్రాన, నేను శ్రేయోభిలాషిని కాకుండా పోయానా"

'మీరానాడు గరపిన బుద్ధులేగదా—మమ్మల్నీనాడు మనుషుల్ని చేసింది' చిత్తశుద్ధిగానే అన్నాను.




"చూడు రాజూ, కొందరికి జీవితాలతో చెలగాటమాడాలని వుంటుంది. ఎదుటివాళ్ళని ఏడ్పించి ఆనందించాలని ఉబలాటపడుతూవుంటారు. మారామ్మూర్తి అలా అయ్యాడు."

"కానీ ఆ ఉబలాటం తమ భవిష్యత్తుకే దెబ్బగదా."

"ఆ ఆలోచన వుండదు."

"ఇంతకీ ఏమయ్యాడు."

"ఏమీ కాలేదు. ఎక్కడో లారీల్లో క్లీనర్‌గా, స్టుడియోల్లో బాయ్‌గా, సినిమాహాళ్లో గేట్‌కీపర్‌గా ఉంటున్నాడంటున్నారు అక్కడా ఇక్కడా చూసిన వాళ్లు."

వాతావరణం బరువెక్కింది. నేను నిట్టూర్చి, కుర్చీలో వెనక్కి వాలాను. రామ్మూర్తిరూపం స్ఫురణకు వచ్చింది. మెడ నరాలూ, ముఖంమీది నరాలూ ఉబ్బి, ముడితిరిగి వుండేవి. నల్లగా, వికృతంగా వుండేది అతని రూపం.

వృద్ధాప్యంలో రంగప్పగారికి కొడుకుని గురించి కలిగిన బాధకి నామనస్సు కలుక్కుమంది.

"అవునూ—మీరు రిటైరై ఆరేళ్ళు అయివుంటుందికదూ" వాతావరణాన్ని ఈజ్ చేయాలని వేసిన ప్రశ్న ఇది. నాకు తెలుసు.

ఎక్కడ ఆరేళ్ళు పదమూడేళ్ళయింది." గతంలోకి చూపుని సారిస్తూ అన్నాడు.

రామ్మూర్తిద్వారా నేను నేర్చుకున్న పాఠం ఒకటయితే, మా సుమతి ద్వారా నేర్చుకున్నది మరొకటి"

నాకు సుమతి రూపం కళ్ళముందు కదలాడింది.

లేత మొలకలా వుండేది సుమతి. మనిషి ఎవుపు. పుష్టిగానూ వుండేది. ఎర్రంచువున్న, తెల్ల పట్టుపరికిణీమీద ఎర్రజాకెట్టు కట్టుకుని, ఉంగరాల జుట్టుతో ఉయ్యాలలూగుతూ వుండేది. సందెవేళ రోజూ గుడిచుట్టూతిరిగొచ్చి దేవుడికి దణ్ణం పెట్టుకుని వెళ్తూవుండేది. ధ్వజస్తంభం పక్కగా మేము గోళీలాడు కుంటూ వుండే వాళ్లం ఆ సమయానికి.

నాకు ఇప్పటికీ బాగా గుర్తు. ఒకసారి అట్లతద్దె రోజున మెదుగు ఆకు పొట్లంలో అట్లు పెట్టుకుని మాయింటికివచ్చింది. అమ్మ చేతికియిచ్చి పరిగెత్తుకు పోతుంటే అమ్మ పరిహాసంగా అంది. "మా అబ్బాయికోసం తెచ్చి నాకిచ్చి పోతావేం. వాడికే యివ్వు అంత ప్రేమయితే" అని 'ఛీ పో' అని తుర్రున పారిపోయింది సుమతి.

"సుమతి ఎలావుందిప్పుడు ? ఏవూళ్లో వుండటం ?" అడిగేను.

రంగప్పగారు నాకేసి చూశారు. నేను "చెప్పండి" అన్నాను.

"నమ్మకాలనేది మనిషిని ఓఆట ఆడిస్తాయని పిస్తుంది. నావరకు ఇది నిజం. తరుచుగా చదువుని గురించీ, అభ్యాసాల గురించీ, క్రమశిక్షణ గురించీ హెచ్చరిస్తూ రామ్మూర్తిని చెడగొట్టాననే నమ్మకం ఏర్పడింది. వాడలా జులాయిగామారి, ఇల్లు వదలి వెళ్ళిపోయిన తర్వాత. అందుకని సుమతి విషయంలో పగ్గాలు వదిలేశాను. ఇంకా చెప్పాలంటే గేట్లు ఎత్తేశాను. పర్యవసానంగా ఆమెకూడా నాకు తగిన గుణపాఠం చెప్పింది. నాకూతురి పేరే సుమతి-సుమతి కుమతి కానేకాదనే నా నమ్మకాన్ని వమ్ముచేసి తానూ వెళ్ళిపోయింది." చెప్పటం ఆపి గ్లాసులో నీళ్ళు తాగేడు, ఆయన.

"ఓ క్రిష్టియన్‌ని ప్రేమించి అతనితో వెళ్ళిపోయింది"

"కులాసాగా వుంటున్నారు కదా" అడిగాను,

"తెలీదు. ఎవరో కబుర్లు చేరేస్తూ వుంటారు. కాకినాడలో వుంటున్నారనీ, ఇద్దరు పిల్లలనీ."

"పోనీలెండి. క్షేమంగా సుఖంగావుండీ తిన్నగా కాపురం చేస్తున్నది గదా మంచిదే"

రంగప్పగారు నవ్వేడు మ్లానంగా. "ఏంమంచో-కామంచి"

*   *   *

భోజనాలయినై.

పల్చటి వెన్నెట్లో ఆరుబయట పడుకున్నాం.

అస్పష్టమైన తపనగావుంది నాకు. రంగప్ప మాష్టారి భార్యపోయి చాలా ఏళ్ళయినట్లు చెప్పాడు. మాటల మధ్యలో. మరి ఈవ్యక్తి ఎవరు? మాకు భోజనం వడ్డించి తలుపువారగా నిలిచిన మనిషి ఎవరు?

ప్రశ్న గోచరిస్తోంది గానీ అడిగే ధైర్యం రావడంలేదు. అలాగని, ఆ విషయం నాకు సంబంధించింది కాదులెమ్మని ఊరుకోవాలనీ అనిపించడంలేదు.

కొబ్బరిమట్టల్లో ఎక్కడో వివరంలేని సవ్వడి వినవస్తుండగా అన్నాడు రంగప్పగారు.

"జీవితంలో అలసిపోయాను రాజూ. అలసిన జీవితానికి విశ్రాంతి ఎంత అవసరమో ఒంటరి మనిషికి ఓ తోడూనీడా కూడా అంతే అవసరం. అందుకనే లోకులేమైనా అనుకోనిమ్మని శాంతిని ఇక్కడే వుండిపొమ్మన్నాను. మనమిప్పుడు ఆరగించింది ఆమె చేతి విందునే"

నేను ఏమీ అనలేదు. నాకు సంబంధించినంత వరకూ ముడి ఇంకా విడివడ లేదు. ఆయనే మళ్ళీ చెప్పసాగేడు.

"ఈ శాంతి ఎలాంటి మనిషో చెప్పనా? చిన్నప్పుడు 'నేను నిన్ను ప్రేమించగలనే గాని పెళ్ళి చేసుకోలేను' అని నామొహాన్న చెప్పిన మనిషి" ఒక్క సారిగా నా వెన్నున చరచినట్లుంది. నా మనస్సంతా గజిబిజిగా అయింది. శివపురంలో ఆఫీసుపని పూర్తిచేసుకుని వెళ్ళిపోతే బాగుండదేమోననే ప్రశ్నకూడా మేధస్సులో మొలిచింది. రంగప్పమాష్టార్ని చూసిపోదామని ఈరాత్రి మజిలీ చేసినందుకు ఆయన కథలోని మలుపుల్ని వినాల్సివచ్చింది.

నాన్న - కళ్ళముందు మెదిలేడు. శారద ఆలోచనలో కదిలింది.

శారద-మామయ్యకూతురు. ఎమ్మేదాకా చదువుకుంది. బ్యాంక్‌లో ఆఫీసరు. నన్నుతప్ప మరొకర్ని పెళ్ళాడనని శపథంచేసిన పెద్ద మంగమ్మ! ఉద్యోగంచేసే యువతిని భార్యగా స్వీకరించనని నిర్ణయించుకున్న వాణ్ణి నేను మరి!

సన్నగా, పొడుగ్గా పల్చగావుండే శారదరూపం గుర్తుకొచ్చింది. కొనతేలిన గడ్డం, చురుకైన పెద్ద కళ్లు, పచ్చటి నున్నటి శరీరం-లావణ్యంలోనూ సౌందర్యంలోను శారద నా స్వప్నాధిదేవతే! కాని అభిరుచుల్లో వైరుధ్యం మా వివాహాన్ని దూరంచేస్తూ వస్తోంది.

"జరిగిందేదో జరిగిపోయింది. అప్పుడప్పుడూ అనిపిస్తూ వుంటుంది. చావు తుదకు లావు దుఃఖం అని. ఈ బాధలన్నీ ఎందుకు. రామ్మూర్తీ,సుమతీ ఒక్కసారి వచ్చి చూసిపోతే బాగుణ్ణు అని. కానీ....కానీ అది జరుగుతుందా?—ఊఁహూఁ"

మాష్టారు ఏదో మాట్లాడుతున్నాడు.

నాకు నిద్ర పట్టేసింది.

ఉలిక్కిపడి లేచి కూర్చున్నాను.

ఒక రాత్రివేళ —

వాక్యాన్ని అక్షరాలు పరచుకొని వున్నట్టు భూమినంతా పరచుకుని వెన్నెల కాస్తోంది.

మా మంచాలకు ఆవలగా.

సపోటా చెట్టుక్రింద అలికిడయింది. లేచి వెళ్ళాను.

మా ఖాశిం! అక్కడ మంచంమీద కూర్చునివున్నాడు. మొహం కప్పుకుని తలవంచి మోకాళ్లమధ్యన పెట్టుకుని వున్నాడు.

నన్నుచూసి కళవళపడి లేచి నిలబడ్డాడు.

"ఏం ఖాశిం నిద్రపోలేదా!" అడిగాను.

"న్దిర రావడంలేదు సార్. ఆకాశంకేసి చూస్తుంటే ఏమేమో వాస్తవాలు గుర్తుకొస్తున్నాయ్" పగిలిన గొంతుతో చెప్తున్నాడు.

నేను విచలితుణ్ణయ్యాను. "ఏం వాస్తవాలు భాయ్" అని ఆత్మీయంగా పలుకరించాను.

"ఏంలేదు సార్. మొన్న మనం కాంప్‌కి బయల్దేరేముందు రోజు నాబిడ్డ పోయినాడు"

అదిరిపడ్డాను. వెన్నున చరచినట్లయింది. గొంతు తడారిపోయింది. క్షణాం తర్వాత తేరుకుని అడిగాను. "అదేంవిటి నాకు చెప్పలేదేం? ఎంత వయస్సు? సో సారీ"

"వయస్సెక్కడ సార్. పుట్టిన నాలుగోరోజునే పోయాడు."

"నీ భార్య ప్రసవించిన సంగతే చెప్పలేదు నువ్. భలేవాడివేనే. ఇంత జరిగితే ఆ మర్నాడే కాంప్‌కి రాకపోతే యేమోయ్. చెప్తే నేనేదో విధంగా సర్దుకునే వాణ్నిగదా" నొచ్చుకున్నాను.

"అంతా బొమ్మలాటసార్. నాటకంలో మన పాత్రని మనం చెయ్యడమే బస్"

గాడిలో పోయే బండికి ఏదో ఓ రాయి చక్రానికి తగిలితే బండి తబ్బిబ్బు అయినట్లు, నా మనసులో ఊగిసలాట ప్రారంభమైంది.

నిమ్మళంగా కదిలేను.

తెల్లవారుతూనే తిరుగు ప్రయాణమయ్యాను.

లోటాలో పాలుత్రాగి లేచి బయటికి వచ్చాను.

అప్పటి కప్పుడే ఖాశిం వెళ్ళి జీపుదగ్గర సిద్ధంగా వున్నాడు.

నాతో కలిసి అడుగులు వేస్తున్నాడు రంగప్ప మేష్టారు.

"నేను వస్తాను మాష్టారూ మరి మీ ఆతిధ్యానికి ధన్యవాదాలు. అన్నదాతా సుఖీభవ" సన్నగా నవ్వేను.

చటుక్కున నా ముందుకొచ్చి నా చేతుల్ని తనచేతుల్లోకి తీసుకున్నాడు. రంగప్ప మేష్టారు.

నీళ్ళునిండిన కళ్ళతో అన్నాడు, "నువ్ పూర్తిచేసుకుని వెళ్తున్న కేసులో నిందితుడు మా శాంతికొడుకే. పొట్టమీద మాత్రం కొట్టకు!"

నేను గతుక్కుమన్నాను! మాటకూడా కట్టుపడింది!

నమస్కారం పెట్టి ముందుకు అడుగేశాను.

"రాజూ- వొక్కమాట" అని మళ్ళీపిల్చాడు. ఆగి వెనక్కి చూశాను. వసారా గుంజకు ఆనుకొని శాంతి! రంగప్పగారిని ప్రేమించగలిగి పెళ్ళిమాత్రం చేసుకోనన్న శాంతి! పద్నాలుగేళ్ళ పలకరింపు యెరుగని ఊర్మిళలా శాంతి!

రెండు నారింజపళ్లు నాచేతిలో వుంచాడు రంగప్ప మాష్టారు. ఎంతో ఆర్ద్రతతో అన్నాడు, "ఈ ప్రాంగణానికి శాంతివనం అని పేరు పెట్టుకొన్నాను. కానీ వైరుధ్యం చూశావా రాజూ- మా ప్రాంగణంలో వుండికానీ శాంతి- మా మనసుల్లో లేదు. ఎందువల్లనో మరి!.... నిలుస్తామరి. ఈ ప్రాంతానికివస్తే ఈ ముసలి మాష్టారిని పలకరించకుండా వెళ్ళమాక"

నేను ముందుకి కదిలేను.

తుంచకుండా విడతీయలేని పీటముడి గోచరిస్తోంది కళ్ళముందు. కానీ, నారింజపండ్లని నాన్నకివ్వాలనిపిస్తోంది.

రంగప్పమాష్టారి కోరిక గుర్తుకొచ్చింది. 'జరిగిందేదో జరిగినా రామ్మూర్తీ సుమతీ వస్తే బాగుండును'.

శాంతి పరోక్షంగా వేడుకున్న అభ్యర్థన గుర్తుకొచ్చింది.

ఆరురోజుల క్రితం పోయిన బిడ్డని తలచుకొంటున్న ఖాశిం మూగవేదన గుర్తుకొచ్చింది.

ఆ వెంటనే అతని మాటలూ నా చెవుల్లో మార్మోగినాయి. "నాటకంలో మన పాత్రని మనం చెయ్యడమే సార్"

జీప్ ఎక్కికూర్చున్నాను.

మామిడి కొమ్మల్లోనుంచీ కోయిల కొసరడం మొదలెట్టినా నలువైపులా, చిరుగాలికి కదిలే రంగురంగులపూలూ, మనోహరంగా ఎగిరే సీతాకోక చిలుకలూ,

పైన-స్వచ్ఛంగా ఆకాశం!

చేతిలోని నారింజపండ్లలో ఒకటి నాన్నకూ ఒకటి శారదకూ అనుకున్నాను. జీపు సాగిపోతోంది.

ఇప్పుడంతా హాయిగా ఉంది. పూవుకంటె తేలిగ్గామారింది గుండె. ●